అక్షర దర్బార్
www.aksharadarbar.com
Voice of the people

# ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి

## జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



అక్షరదర్బార్, జనగామ: కేంద్ర ప్రభుత్వ పథకాలను, రాయితీలను పొందడానికి ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి అని, ఈ ప్రక్రియను పూర్తి చేయాలని, వ్యవసాయ విస్తరణ అధికారుల (ఏఈవోల)కు జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈవో), వ్యవసాయ సిబ్బంది క్షేత్రస్థాయిలో గ్రామాల్లో పర్యటించి, అర్హులైన ప్రతి రైతుతోనూ ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు చేయించాలన్నారు. జిల్లాలో ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియ కూడా వేగవంతం అయ్యేలా చూడాలన్నారు.

శనివారం 23, మే 2026 | సంపుటి :03 | సంచిక :106 | పేజీలు :05 | వెల ₹5



# మురిసిన సరస్వతి ఘాట్

- త్రివేణి సంగమానికి పోటెత్తిన భక్తులు.. సైకత లింగాలకు ప్రత్యేక పూజలు
- శ్రీ కాళేశ్వర ముక్తీశ్వరుడిని దర్శించుకున్న గవర్నర్ దంపతులు
- ఏర్పాట్లపై మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి సమీక్ష
- దేశ విదేశాల్లోని భక్తుల కోసం 'నవరత్న మాల హారతి' లైవ్ టెలికాస్ట్
- కాశీ పండితుల మంత్రోచ్చారణలు.. కనుల పండువగా ప్రత్యేక హారతులు
- పెరుగనున్న భక్తుల రద్దీ.. అలర్ట్ అయిన జిల్లా యంత్రాంగం
- సాంస్కృతిక సారధి కళాకారుల భక్తి గీతాలు.. పులకించిన పుణ్యక్షేత్రం

మూడు నదుల కలయిక.. ముక్తికిది అసలైన వేదిక! పవిత్ర గోదావరి, ప్రాణహిత, అంతర్వాహిని సరస్వతీ నదుల త్రివేణి సంగమ క్షేత్రమైన కాళేశ్వరం ఆధ్యాత్మిక సౌరభాలతో జలపాతపు జావళిలా పులకించిపోతోంది. ఇక్కడ జరుగుతున్న సరస్వతి అంత్య పుష్కరాల సుమధుర వేళ, శుక్రవారం ఉదయం సరస్వతి ఘాట్ కు భక్తులు అశేషంగా తరలివచ్చి పుష్కర పుణ్యస్నానాలు ఆచరించారు. మంత్రోచ్చారణల తరంగాలపై పుణ్యజలాలలో మునిగితేలిన భక్తులు, ఘాట్ల తీరాన ఇసుకతో సైకత లింగాలను అపురూపంగా మలచి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక అర్చనలు చేశారు. శివనామస్మరణతో పుష్కర ఘాట్లన్నీ భక్తుల కోలాహలంతో కళకళలాడాయి.

- అక్షరదర్బార్, కాళేశ్వరం

- వివరాలు 6లో..

# డిప్యూటీ కలెక్టర్ ఇళ్లపై ఏసీబీ రైడ్స్

- ప్రభుత్వ భూమిని మామ పేరిట రాసి రియల్టర్‌కు కట్టబెట్టిన వైనం
- వందల కోట్ల అక్రమాస్తుల గుర్తింపు




దర్బార్, హైదరాబాద్ : రెవెన్యూ శాఖలో మరో అవినీతి తిమింగలం ఏసీబీ వలకు చిక్కింది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా డిప్యూటీ కలెక్టర్ (గతంలో శేరిలింగంపల్లి ఆర్‌డీఓ) వంశీ మోహన్ ఇళ్లు, కార్యాలయాలపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు ఏకకాలంలో మెరుపు దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో వందల కోట్ల రూపాయల విలువైన అక్రమాస్తులు వెలుగుచూడటం రెవెన్యూ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. వంశీ మోహన్ గతంలో శేరిలింగం పల్లితో పాటు పలు కీలక ప్రాంతాల్లో ఆర్‌డీఓగా పనిచేశారు. ఆ సమయంలో ఆయన తన అధికార బలంతో భారీగా భూ అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. ముఖ్యంగా, అబ్దుల్లాపూర్ మెట్, పిగ్లీపురం ప్రాంతాలలో ఉన్న సుమారు 8 ఎకరాల విలువైన ప్రభుత్వ భూమిని ఆయన అక్రమంగా కాజేశారు.

### వ్యూహాత్మకంగా రిజిస్ట్రేషన్లు

సదరు ప్రభుత్వ భూమిని వంశీ మోహన్ నేరుగా కాకుండా, ముందుగా తన సొంత మామ పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించారు. ఆ తర్వాత సదరు భూమిని ఒక ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారికి దారాదత్తం చేసినట్లు ఏసీబీ ప్రాథమిక విచారణలో గుర్తించింది. ఈ భూముల మార్పిడి వెనుక వందల కోట్ల రూపాయల చేతులు మారినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు వంశీ మోహన్‌కు చెందిన నివాసాలు, ఆయన బంధువుల ఇళ్లు, కార్యాలయాల్లో ఏకకాలంలో తనిఖీలు చేపట్టారు.

### వందల కోట్ల ఆస్తులు

ప్రాథమిక తనిఖీల్లోనే ఓపెన్ ప్లాట్లు, విల్లాలు, వ్యవసాయ భూములకు సంబంధించిన కీలక పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వీటి మార్కెట్ విలువ వందల కోట్లలో ఉంటుందని అంచనా. సోదాల్లో భారీగా నగదు, బంగారు ఆభరణాలు, విదేశీ కరెన్సీ లభించినట్లు సమాచారం. బెనామీల పేరిట పెట్టుబడులు రియల్ ఎస్టేట్ రంగాంతో పాటు పలు వ్యాపారాల్లో బెనామీల పేరిట వంశీ మోహన్ పెట్టుబడులు పెట్టినట్లు ఏసీబీ డైరీలలో, పత్రాలలో ఆధారాలు లభ్యమయ్యాయి.


### గతంలోనూ వివాదాస్పదంగా..

శేరిలింగంపల్లి వంటి అత్యంత ఖరీదైన ప్రాంతంలో ఆర్‌డీఓగా పనిచేసిన కాలంలోనే వంశీ మోహన్ పలు వివాదాస్పద భూ సెటిల్మెంట్లు చేసినట్లు ప్రచారం ఉంది. ప్రభుత్వ భూములను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టడంలో ఆయన సిద్ధహస్తుడనే ఆరోపణలు ఉన్నాయి. తాజాగా అబ్దుల్లాపూర్ మెట్ భూ కుంభకోణం పక్కా ఆధారాలతో బయటపడటంతో ఏసీబీ పంజా విసిరింది. ప్రస్తుతం ఏసీబీ అధికారులు వంశీ మోహన్‌ను సుదీర్ఘంగా విచారిస్తున్నారు. లభించిన డాక్యుమెంట్ల ఆధారంగా మరికొందరు అధికారులు, రియల్ ఎస్టేట్ వ్యాపారుల పేర్లు కూడా బయటకు వచ్చే అవకాశం ఉందని ఏసీబీ వర్గాలు వెల్లడించాయి.

## జోగంపల్లిలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు


- పంట వ్యర్థాల దహనంతో శ్వాసకోశ వ్యాధులు
- డా.బి.విద్యాధర్ హెచ్చరిక

అక్షర దర్బార్, శాయంపేట: వ్యవసాయంలో సుస్థిర పద్ధతుల ప్రాధాన్యతపై రైతులకు అవగాహన కల్పించేందుకు శాయంపేట మండలంలోని జోగంపల్లి గ్రామంలో "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు – రచ్చబండ" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ డా. బి. విద్యాధర్, టీచింగ్ అసోసియేట్ డా. బి. సిద్ధార్థ నాయక్ ప్రసంగించారు. వరి కోతల అనంతరం అవశేషాలను తగులబెట్టడం వల్ల వాతావరణ కాలుష్యం పెరగడమే కాకుండా నేలలో ఉండే ఉపయోగకర సూక్ష్మజీవులు నశించి భూసారం తగ్గిపోతుందని వివరించారు. దీనివల్ల కార్బన్ డై ఆక్సైడ్, మీథేన్, నైట్రస్ ఆక్సైడ్ వంటి హానికర వాయువులు విడుదలై గ్లోబల్ వార్మింగ్ తీవ్రత పెరుగుతుందన్నారు. వెలువడే పొగ వాతావరణంలో సూక్ష్మ ధూళి కణాల స్థాయిని పెంచి గాలి నాణ్యతను దెబ్బతీస్తుందని, దీనివల్ల చిన్నపిల్లలు, వృద్ధులకు ఆస్థమా, దగ్గు, కంటి మంటలు, ఊపిరితిత్తుల వ్యాధులు పెరిగే అవకాశముందని హెచ్చరించారు. రైతులు పంట అవశేషాలను కాల్చకుండా వాటిని మల్చింగ్, కంపోస్టింగ్, వర్మీకంపోస్టు తయారీ లేదా పశువుల మేతగా వినియోగిస్తే సాగు వ్యయం తగ్గి నేల ఆరోగ్యం మెరుగుపడుతుందని శాస్త్రవేత్తలు సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు ఏఓ ప్రియదర్శిని, ఏఈఓ అన్వేష్ పాల్గొని ప్రభుత్వ పథకాలను వివరించారు. కార్యక్రమంలో గ్రామ వాలంటీర్లు ప్రణయ్, నాగరాజు, సర్పంచ్ ప్రభాకర్ రావు మరియు రైతులు పాల్గొన్నారు.



## ఉపసర్పంచ్ రాజు కుటుంబానికి ఓదార్పు

వెంకటాపూర్, అక్షర దర్బార్: ములుగు జిల్లా వెంకటాపూర్ మండల ఉపసర్పంచ్ అన్నబోయిన రాజు తల్లి అన్నబోయిన అయిలక్క ఇటీవల మృతి చెందగా, వారి కుటుంబ సభ్యులను ములుగు జిల్లా ఉపసర్పంచుల సంఘం ప్రతినిధులు శుక్రవారం పరామర్శించారు. వెంకటాపూర్‌లోని నివాసానికి వెళ్లిన సంఘం నాయకులు అయిలక్క చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి, తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కుటుంబ పెద్దను కోల్పోవడం అన్నబోయిన రాజు కుటుంబానికి తీరని లోటని, చాలా బాధాకరమని పేర్కొన్నారు. ఆ తల్లి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొట్ల కార్తీక్, ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రకాష్, జిల్లా అధికార ప్రతినిధి రాజు యాదవ్, ములుగు మండల అధ్యక్షుడు బద్రు నాయక్, పలు గ్రామాల ఉపసర్పంచులు పాల్గొన్నారు.



## పెద్దకోడేపాకలో సీసీ కెమెరాల డెమో

అక్షర దర్బార్, శాయంపేట: నేరాల నియంత్రణలో భాగస్వాములు కావడానికి ప్రతి గ్రామంలో ప్రజలు, ప్రజాప్రతినిధులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని శాయంపేట సీఐ సుధాకర్ రెడ్డి కోరారు. శాయంపేట మండలంలోని పెద్దకోడేపాక గ్రామ సర్పంచ్ మంద దీనా మరియు గ్రామ పాలకవర్గం సహకారంతో రూ. 25 వేల విలువైన నాలుగు సోలార్ సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ సుధాకర్ రెడ్డి, ఎస్సై పరమేష్ సమక్షంలో ఈ సోలార్ సీసీ కెమెరాల పనితీరుపై డెమోన్స్ట్రేషన్ నిర్వహించారు. గ్రామ పెద్దలు, ప్రజలు సీసీ కెమెరాల ప్రాధాన్యతను గుర్తించి భద్రతను మెరుగుపరుచుకోవాలని సీఐ సూచించారు.





## కార్పొరేట్ కాలేజీల్లో ఉచిత ప్రవేశాలు

- అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం
- అధికారి కొమురయ్య

అక్షర దర్బార్, ములుగు: 2026-27 విద్యా సంవత్సరానికి గాను కార్పొరేట్ ఇంటర్మీడియట్, ఎంసెట్ కళాశాలల్లో ఉచిత ప్రవేశం పొందేందుకు అర్హులైన విద్యార్థుల నుండి ఆన్‌లైన్ దరఖాస్తులు కోరుతున్నట్లు ములుగు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కొమురయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి, పదో తరగతిలో 7.0 జీపీఏ లేదా ఆపై ఫలితాలు సాధించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ మరియు దివ్యాంగ విద్యార్థులు దీనికి అర్హులని స్పష్టం చేశారు. మెరిట్ ప్రాతిపదికన సీజీజీ ఆన్‌లైన్ ఆటోమేటిక్ సిస్టమ్ ద్వారా విద్యార్థుల ఎంపిక జరుగుతుందన్నారు. అర్హత గల విద్యార్థులు ఈ-పాస్ వెబ్‌సైట్ (http://www.telanganaepass.cgg.gov.in) ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ ప్రవేశాల ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ మే 20 నుండి ప్రారంభం కాగా, దరఖాస్తుకు జూన్ 5 చివరి తేదీ అని తెలిపారు. జూన్ 10న ఆన్‌లైన్ ఆటోమేటిక్ సిస్టమ్ ద్వారా ఎంపిక ప్రక్రియ, జూన్ 12న సంబంధిత ఉప సంచాలకులచే ధృవీకరణ పత్రాల పరిశీలన ఉంటుందని వివరించారు. దరఖాస్తు చేసుకునే వారు మీ-సేవా ద్వారా పొందిన కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు (2026 నాటిది), ఎస్ఎస్సీ మార్కుల మెమో, గుర్తింపు కార్డు వివరాలు, బ్యాంక్ పాస్ బుక్, 4 నుండి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు, హాస్టల్ విద్యార్థులైతే బోనఫైడ్ సర్టిఫికెట్ మరియు పాస్‌పోర్ట్ ఫోటోలను సిద్ధం చేసుకోవాలని కొమురయ్య కోరారు.

# సమాచారం అందిస్తే రూ.50 వేల బహుమతి

- లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు
- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



అక్షరదర్బార్, హనుమకొండ: చట్టవిరుద్ధంగా లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లపై పటిష్ట నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో లింగ నిర్ధారణ నియంత్రణ చట్టం అమలుపై జిల్లా అప్రాప్రియేట్ అథారిటీ కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఇప్పటివరకు ఎన్ని ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లలో తనిఖీలు నిర్వహించారో, ఎలాంటి చర్యలు చేపట్టారో, బాలికల లింగ నిష్పత్తి తక్కువగా ఉన్న మండలాల పరిస్థితి ఏమిటో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అల్లం అప్పయ్యను అడిగి వివరాలు తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చట్టవిరుద్ధంగా లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే వారిపై పీసీపీఎన్‌డీటీ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లపై రహస్య డీకాయ్ ఆపరేషన్లు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. చట్టవిరుద్ధంగా లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే వారి గురించి 6300030940 ఫోన్ నంబర్‌కు లేదా 104, 1098, 181 టోల్ ఫ్రీ నంబర్లకు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గర్భ విచ్ఛిత్తి కోసం అక్రమంగా వినియోగించే కిట్లను విక్రయించే మెడికల్ షాపులపై కూడా ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని సూచించారు. లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లకు సంబంధించిన ఖచ్చితమైన సమాచారాన్ని అందించే వారికి రూ.50 వేల ప్రోత్సాహక బహుమతి అందజేయనున్నట్లు ప్రకటించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఇప్పటికే బాలికలు ఉన్న గర్భిణీలపై ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని, అనుమానాస్పద గర్భ విచ్ఛిత్తి ఘటనలపై అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా రెండవ అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఎస్ చందన మాట్లాడుతూ సంబంధిత శాఖలతో కలిసి రహస్య తనిఖీలు నిర్వహించేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. గర్భిణీలతో పాటు వారి కుటుంబ సభ్యులు, సన్నిహితుల ద్వారా కూడా లింగ నిర్ధారణ పరీక్షలు, అక్రమ గర్భ విచ్ఛిత్తులపై సమాచారం సేకరించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి విశ్వజ, కమిటీ సభ్యులు నీతా పనిభట్, సీసీఆర్‌బీ ఇన్స్పెక్టర్ మల్లయ్య, ప్రోగ్రామ్ అధికారి రూబీనా అఫ్రోజ్, డెమో అశోక్ రెడ్డి, మిషన్ శక్తి కోఆర్డినేటర్ కళ్యాణి, హెల్త్ సూపర్వైజర్ పద్మజ తదితరులు పాల్గొన్నారు.

## కూలీలకు మజ్జిగ పంపిణీ

శివాజీనగర్ సర్పంచ్ సుఖినే నాగరాజు చొరవ

అక్షర దర్బార్, దుగ్గొండి: వేసవి కాలంలో ఎండ తీవ్రతకు తీవ్రంగా ఇబ్బంది పడుతున్న ఉపాధి హామీ కూలీలకు ఉపశమనం కలిగించేందుకు దుగ్గొండి మండలం శివాజీనగర్ సర్పంచ్ సుఖినే నాగరాజు చల్లని మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. గ్రామంలో సాగుతున్న ఈజీఎస్ పనుల వద్ద పనిచేస్తున్న కూలీల దాహార్తిని తీర్చేందుకు ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ సుఖినే నాగరాజు మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్యం మరియు వారి సంక్షేమమే తమ పాలకవర్గం ప్రధాన లక్ష్యమని, అందువల్లనే మండుటెండల్లో పనులు చేసే వారికి చల్లని మంచినీటితో పాటు మజ్జిగ ప్యాకెట్లు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామ ప్రజలకు తాము ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సేవా కార్యక్రమాలను ఇలాగే కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బుస్సారి రామారావు, వార్డు సభ్యులు కాల్ వాణి, బూరెల రాజేశ్వరి, రాపు



బోరగని రజిత, బొల్లి స్వామి, పలువురు నాయకులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# రూ. 24.27 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

- 58 మంది లబ్ధిదారులకు అందజేసిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



అక్షరదర్బార్, పరకాల: పరకాల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. పరకాల టౌన్, పరకాల రూరల్, నడికూడ, ఆత్మకూరు, దామెర మండలాలకు చెందిన 58 మంది అర్హులైన లబ్ధిదారులకు రూ. 24 లక్షల 27 వేల 750 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ.. పేద ప్రజలు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేద కుటుంబాలకు వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతగానో భరోసాగా నిలుస్తోందన్నారు. రాష్ట్రంలో రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని, ప్రజల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్లు, రైతు రుణమాఫీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రైతు బీమా, సన్న వడ్లకు రూ. 500 బోనస్, మహాలక్ష్మి పథకం, గ్యాస్ సబ్సిడీ, వడ్డీ లేని రుణాలు, స్త్రీనిధి రుణాలు తదితర పథకాలను ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తోందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో పరకాల మున్సిపల్ చైర్మన్ సునీల్ కుమార్, పలువురు ప్రభుత్వ అధికారులు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# కార్మికులకు ఎస్పీ సుదీర్ రామ్‌నాథ్ న్యాయం

- సోషల్ మీడియా ఫిర్యాదుపై తక్షణ స్పందన
- ఇటుక బట్టీల వద్ద తనిఖీ



అక్షర దర్బార్, ములుగు: ములుగు జిల్లా బండారుపల్లి గ్రామంలోని ఇటుక బట్టీల వద్ద పనిచేస్తున్న కార్మికులను యజమాని వేధిస్తున్నాడంటూ సోషల్ మీడియా ద్వారా అందిన ఫిర్యాదుపై ములుగు జిల్లా ఎస్పీ కేకాన్ సుదీర్ రామ్‌నాథ్ తక్షణమే స్పందించారు. ఎస్పీ స్వయంగా సంబంధిత ఇటుక బట్టీ పని ప్రదేశానికి చేరుకుని క్షేత్రస్థాయి పరిస్థితిని పరిశీలించారు. బండారుపల్లి ప్రాంతంలోని కేఎంకే బ్రిక్స్ వద్ద పనిచేస్తున్న కార్మికులు, తమ కుటుంబాలను ఇక్కడి యజమాని అక్రమంగా నిర్బంధించి సొంత రాష్ట్రానికి వెళ్లనీయడం లేదని ఫిర్యాదు చేయగా, దీనిని ఎస్పీ అత్యంత ప్రాధాన్యతగా తీసుకున్నారు. అక్కడ ఉన్న కార్మికులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఇటుక బట్టీల యజమానితో మాట్లాడగా.. తాము కార్మికులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించలేదని, వారు సొంత రాష్ట్రానికి వెళ్లేందుకు వాహనాన్ని సైతం ఏర్పాటు చేశామని ఎస్పీకి వివరించాడు. కార్మికులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా, వారు తమ స్వగ్రామాలకు సురక్షితంగా వెళ్లేందుకు ఎస్పీ పూర్తి భరోసా కల్పించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో ములుగు డీఎస్పీ నలువాల రవీందర్, ములుగు ఎస్ఐ ఉపేందర్ కలిసి పాల్గొన్నారు.

# మంటలతో మట్టిని మాడ్చొద్దు!

- పంట అవశేషాల దహనంతో తగ్గుతున్న భూసారం
- పెరుగుతున్న ప్రమాదాలు



అక్షరదర్బార్, పరకాల: పంట పొలాల్లో అవశేషాలను తగులబెట్టే అలవాటు రోజురోజుకూ ప్రమాదకరంగా మారుతోంది. ఇది భూమికి బంగారంలాంటి సారాన్ని కోల్పోయేలా చేయడంతో పాటు అమాయక ప్రజల ప్రాణాలకూ ముప్పుగా పరిణమిస్తోంది. అధికారులు హెచ్చరిస్తున్నా కొంతమంది పంట అవశేషాలను కాల్చడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో నిత్యం అగ్ని ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇటీవల శాయంపేట మండలంలో అవశేషాల మంటల్లో ఓ రైతు ప్రాణాలు కోల్పోగా, నడికూడ మండలం రామకృష్ణాపూర్ గ్రామ శివారులో పొగ కారణంగా ఎదురెదురుగా వాహనాలు ఢీకొని ఓ యువకుడు మృతి చెందాడు. గురువారం పరకాల పట్టణంలోని గ్యాస్ గోదాం వెనకాల పంట అవశేషాలు కాల్చడం తీవ్ర ఆందోళన కలిగించింది. మంటలు గ్యాస్ గోదాం వైపు వ్యాపించకుండా పోలీసులు, స్థానికులు అప్రమత్తంగా వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పింది. పంట అవశేషాలను కాల్చడం వల్ల భూమిలోని సేంద్రియ పదార్థాలు నశించి భూసారం తగ్గిపోతుందని, వాతావరణ కాలుష్యం పెరిగి ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుందని వ్యవసాయ నిపుణులు హెచ్చరిస్తున్నారు. రైతులు పంట అవశేషాలను కాల్చకుండా యంత్రాల ద్వారా భూమిలో కలపడం, పశువుల మేతగా వినియోగించడం వంటి ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.




# రైతు కుటుంబానికి పరామర్శ

అక్షరదర్బార్, పరకాల: నడికూడ మండలం నర్సక్కపల్లి గ్రామానికి చెందిన రైతు సంఘం నాయకుడు సూరావు బాపూరావు కుమారుడు సూరావు ప్రవీణ్ ఇటీవల అనారోగ్యంతో అకాల మృతి చెందడంతో, వారి నివాసానికి వెళ్లిన తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రవీణ్ చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించి, ఆ కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ పరామర్శ కార్యక్రమంలో తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వరికెల కిషన్‌రావు, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు హింగే భాస్కర్, సుకినే సుధాకర్, చౌల రామారావు, నాగుర్ల ధర్మారావు, సూరావు కిషన్‌రావు, ప్రభాకర్, రామారావు, రాజీరు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ఆస్తులను కాపాడాలి

- అధికారులను అప్రమత్తం చేసిన ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనా చారి

అక్షర దర్బార్, చిట్యాల: వ్యవసాయంపై ఆధారపడి జీవించే రైతన్నలు ప్రకృతి ప్రకోపానికి బలి అవుతున్నారని, పంటలు చేతికందే సమయంలో అగ్నిప్రమాదాలు జరిగి సర్వం కోల్పోయి అప్పులపాలవుతున్నారని మాజీ స్పీకర్, శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనా చారి అన్నారు. శుక్రవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలోని ఎంపేడు, కుందన్‌పల్లి, బండపల్లి తదితర గ్రామాల్లో పంట పొలాల్లో అగ్నిప్రమాదం సంభవించి, మంటలు దావానంలా చుట్టుపక్కల ప్రాంతాలకు వ్యాపిస్తున్న విషయం తెలిసిన వెంటనే ఆయన ఫోన్ ద్వారా అధికారులను అప్రమత్తం చేశారు. ఈ ఘటనపై వెంటనే జిల్లా కలెక్టర్, ఎస్పీ, సింగరేణి జీఎం, జిల్లా ఫైర్ అధికారులతో సిరికొండ మధుసూదనా చారి మాట్లాడారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి తక్షణమే ఫైర్ ఇంజన్లను ఘటనా స్థలానికి పంపించాలని, అవసరమైతే సింగరేణి సహాయాన్ని కూడా వినియోగించాలని సూచించారు. వేసవి తీవ్రత కారణంగా అగ్ని మరింత విస్తరించి సమీప గ్రామాలకు నష్టం కలిగించే అవకాశం ఉన్నందున అధికారులు అత్యవసర చర్యలు చేపట్టి ప్రజా ఆస్తులను కాపాడాలని విజ్ఞప్తి చేశారు.



# సుమలత హత్య కేసులో కొత్త ట్విస్ట్

- పోలీసుల అదుపులో భార్యాభర్తలు
- మృతురాలి కాల్ లిస్ట్ ఆధారంగా విచారణ వేగవంతం



అక్షర దర్బార్, దుగ్గొండి: దుగ్గొండి మండలం లక్ష్మీపురం గ్రామంలో వివాహిత తాళ్లపెల్లి సుమలత అనుమానాస్పద మృతి కేసులో సరికొత్త కోణాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ దారుణ హత్యకు కారణమైనట్లు భావిస్తున్న అదే గ్రామానికి చెందిన ఒక వ్యక్తిని, అతని భార్యను మరియు వారి బంధువులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. సుమలత గత కొంతకాలంగా వివాహేతర సంబంధం పెట్టుకుందనే ప్రచారం గ్రామంలో సాగుతుండగా, ఆ కోణంలోనే పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా సదరు అనుమానితుడి బామ్మర్దిని సైతం పోలీసులు సుదీర్ఘంగా విచారిస్తున్నారు. ఈ హత్య ఉదంతంలో ఒకరి కంటే ఎక్కువ మంది ప్రమేయం ఉన్నట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. మృతురాలు సుమలత మొబైల్ ఫోన్ కాల్ లిస్ట్ ఈ కేసు విచారణలో అత్యంత కీలకంగా మారింది. కాల్ డేటా ఆధారంగా జరిపిన పరిశోధనతో విచారణ ప్రక్రియ ఇప్పటికే చివరి దశకు చేరినట్లు తెలుస్తోంది. పూర్తి దర్యాప్తు మరియు నివేదికల అనంతరం హత్యకు సంబంధించిన పూర్తి వివరాలను అధికారికంగా వెల్లడిస్తామని పోలీసులు స్పష్టం చేశారు.

# మృతుని కుటుంబానికి చంద్రయ్యపల్లి గ్రామస్తుల అండ

- రూ. 35 వేల ఆర్థిక సాయం, 50 కిలోల బియ్యం అందజేత

అక్షర దర్బార్, నర్సంపేట: నర్సంపేట మండలంలోని చంద్రయ్యపల్లి గ్రామానికి చెందిన కుక్కమూడి తిరుపతి అనే యువకుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ నిరుపేద కుటుంబం రోడ్డున పడింది. తిరుపతి మరణంతో అతని భార్య, ఒక కుమారుడు అనాథలుగా మారారు. ఈ విషయం తెలుసుకున్న చంద్రయ్యపల్లి గ్రామస్థులు మానవత్వంతో స్పందించి బాధితులకు అండగా నిలిచారు. మృతుని కుటుంబానికి రూ. 35 వేల నగదుతో పాటు 50 కిలోల బియ్యాన్ని తక్షణ సాయంగా అందజేశారు. ఈ రూ. 35 వేల నగదును చిన్నారుల పేరు మీద బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయనున్నట్లు గ్రామస్థులు తెలిపారు. రాబోయే రోజుల్లోనూ ఆ పిల్లల చదువుకు, కుటుంబానికి తోడుగా ఉంటామని గ్రామస్థులు హామీ ఇచ్చి తమ ఉదారతను చాటుకున్నారు.



# విద్యుత్ శాఖ నిర్లక్ష్యం వీడాలి

- మక్క పెరాలను కాల్చవద్దు
- అగ్ని ప్రమాదాలకు ట్రాన్స్‌కో అధికారులే బాధ్యత వహించాలి
- దగ్ధమైన పంటలను పరిశీలించిన
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు
- బాధితులకు పరామర్శ



అక్షర దర్బార్, చిట్యాల: చిట్యాల మండలంలో ఇటీవల అగ్ని ప్రమాదాలకు గురై కాలిపోయిన పంట పొలాలను శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు స్వయంగా పరిశీలించి బాధితులను పరామర్శించారు. రామచంద్రపురం గ్రామానికి చెందిన సిరిపురం కుమారస్వామి అరటి తోట, చల్లగారిగె గ్రామానికి చెందిన చాడా సమ్మిరెడ్డి పామాయిల్ తోట, మండల కేంద్రానికి చెందిన బాలవేణి వేణు మిరప తోటలు ప్రమాదవశాత్తు కాలిపోయిన నేపథ్యంలో ఎమ్మెల్యే వాటిని పరిశీలించి రైతులకు ధైర్యం చెప్పారు. కష్టపడి పండించిన పంటలు బుడిదై రైతులు తీవ్రంగా నష్టపోవడం బాధాకరమన్నారు. పొలాల పైనుంచి వెళ్లిన కరెంటు తీగలు గాలి వానకు ఒకదానికొకటి రాసుకోవడం వల్లే ఈ అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయని మండిపడ్డారు. ఈ ప్రమాదాల పట్ల విద్యుత్ (ట్రాన్స్‌కో) అధికారులు పూర్తిగా బాధ్యత వహించాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు డిమాండ్ చేశారు. ఎండ వేడిమికి తీగలు సాగి కిందకు వేలాడుతూ ఒకదానికొకటి రాసుకుంటున్నాయని, వెంటనే అధికారులు స్పందించి సాగిన తీగలను సరిచేసి ప్రమాదాలను అరికట్టాలని కోరారు. అలాగే, కోతలు పూర్తయిన తర్వాత మక్క పంట వ్యర్థాలను (పెరాలను) రైతులు తగులబెట్టవద్దని విజ్ఞప్తి చేశారు. వీటిని కాల్చడం వల్ల పక్కన ఉన్న తోటలకు ప్రమాదాలు జరగడంతో పాటు భూమి సారం దెబ్బతింటుందన్నారు. వ్యర్థాలను రోటవేటర్‌తో పొలంలోనే దున్నివేస్తే వానలకు తడిసి మంచి సేంద్రియ ఎరువుగా మారుతుందని సూచించారు. ఈ పర్యటనలో తహసీల్దార్ తూకుంట్ల వసంతరావు, ఎంపీడీవో జయశ్రీ, ఎస్సై పోచంపల్లి సతీష్, కాంగ్రెస్ పార్టీ జిల్లా, మండల నాయకులు ముకిరాల మధువంశీ కృష్ణ, దొడ్డి కిష్టయ్య, గూట్ల తిరుపతి, బాధితుడు సిరిపురం కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదాలపై తహసీల్దార్ విచారణ

- ఆస్తి నష్టంపై పైఅధికారులకు సర్వే నివేదికల సమర్పణ

అక్షర దర్బార్, చిట్యాల: వివిధ కారణాల వల్ల చిట్యాల మండలంలో ఇటీవల చోటు చేసుకున్న అగ్నిప్రమాదాలలో జరిగిన భారీ ఆస్తి నష్టంపై స్థానిక తహసీల్దార్ తూకుంట్ల వసంతరావు క్షేత్రస్థాయి విచారణ చేపట్టారు. ఈ ప్రమాదాలపై సమగ్ర సర్వేలు నిర్వహించి, నష్టపరిహార నివేదికలను పైఅధికారులకు అందించినట్లు శుక్రవారం ఆయన తెలిపారు. ఇటీవల జరిగిన ప్రమాదాల్లో కైలాపూర్ గ్రామ శివారులో సిరిపురం కుమారస్వామికి చెందిన నాలుగు ఎకరాల 20 గుంటల అరటి తోట పూర్తిగా భస్మమైంది. అలాగే చల్లగరిగే గ్రామంలో చాడ సమ్మిరెడ్డికి చెందిన రెండు ఎకరాల పామాయిల్ తోటతో పాటు డ్రిప్పు పైపులు, వెంకట్రావుపల్లికి చెందిన బాలవేణి వేణు తాను కౌలుకు తీసుకున్న 1.20 గుంటల మిర్చి పంట మరియు డ్రిప్ పైపులు అగ్ని ప్రమాదంలో కాలి బూడిదయ్యాయి. ఈ ఘటనలపై పూర్తిస్థాయిలో సర్వే పూర్తి చేసి, నష్టపోయిన రైతులకు ప్రభుత్వ సహాయం అందేలా నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించినట్లు తహసీల్దార్ తూకుంట్ల వసంతరావు వివరించారు.

## ప్రేమ పేరిట మోసం

- నిందితుడి అరెస్ట్

అక్షర దర్బార్, శాయంపేట : ప్రేమ, పెళ్లి పేరుతో ఓ యువతిని నమ్మించి మోసం చేసిన నిందితుడిని శాయంపేట పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఆత్మకూర్ మండలం పెంచికలపేట గ్రామానికి చెందిన దుగ్యాల నాని, శాయంపేట మండలానికి చెందిన యువతిని ప్రేమ పేరుతో మోసం చేశాడు. దీంతో మనస్థాపం చెందిన యువతి గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి, హన్మకొండ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు శాయంపేట ఎస్సై జె. పరమేశ్వర్ కేసు నమోదు చేయగా, సీఐ వై. సుధాకర్ రెడ్డి నిందితుడు దుగ్యాల నానిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

# అగ్ని ప్రమాదాలపై సర్వే చేయాలి

- ఏఐఎఫ్టీ (యూ) రాష్ట్ర అధ్యక్షుడు మోడెమ్ మల్లేష్ డిమాండ్



అక్షర దర్బార్, నర్సంపేట: వివిధ కారణాల వల్ల నర్సంపేట డివిజన్‌లోని పలు మండలాల్లో చోటు చేసుకున్న అగ్నిప్రమాదాలలో జరిగిన భారీ ఆస్తి నష్టంపై వివిధ శాఖల అధికారులు వెంటనే స్పందించి, సిబ్బందిచే క్షేత్రస్థాయి సర్వేలు నిర్వహించి ఉన్నతాధికారులకు నివేదికలు అందించాలని ఏఐఎఫ్టీ (యూ) రాష్ట్ర అధ్యక్షుడు మోడెమ్ మల్లేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం దుగ్గొండి మండల కేంద్రంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల చోటు చేసుకున్న ప్రమాదాల్లో రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు అకాల అగ్నిప్రమాదాలకు ఆహుతి కావడం అత్యంత విచారకరమన్నారు. విద్యుత్ లోపాలు, ఇతర ప్రమాదాలు రైతుల పాలిట శాపంగా మారి వారిని రోడ్డున పడేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. డివిజన్ వ్యాప్తంగా అన్ని మండలాల్లో వేల ఎకరాలలో పంటలు, తోటలు, డ్రిప్ పైపులు కాలిపోవడంతో రైతాంగానికి తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. అధికారులు ఈ ఘటనలపై పూర్తిస్థాయిలో సమగ్ర విచారణచేసి నష్టపరిహార నివేదికలను తక్షణమే ప్రభుత్వానికి పంపాలని మోడెమ్ మల్లేష్ కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు, నాయకులు పాల్గొన్నారు.







# గోదావరి లహరిలో పుష్కర పులకింత

# మురిసిన సరస్వతి ఘాట్




- త్రివేణి సంగమానికి పోటెత్తిన భక్తులు.. సైకత లింగాలకు ప్రత్యేక పూజలు
- శ్రీ కాళేశ్వర ముక్తీశ్వరుడిని దర్శించుకున్న గవర్నర్ దంపతులు
- ఏర్పాట్లపై మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి సమీక్ష
- దేశ విదేశాల్లోని భక్తుల కోసం 'నవరత్న మాల హారతి' లైవ్ టెలికాస్ట్
- కాశీ పండితుల మంత్రోచ్ఛారణలు.. కనుల పండువగా ప్రత్యేక హారతులు
- పెరుగనున్న భక్తుల రద్దీ.. అలర్ట్ అయిన జిల్లా యంత్రాంగం
- సాంస్కృతిక సారధి కళాకారుల భక్తి గీతాలు.. పులకించిన పుణ్యక్షేత్రం

అక్షరదర్బార్, కాళేశ్వరం : కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా శుక్రవారం ఉదయం సరస్వతి ఘాట్ కు భక్తులు భారీగా తరలివచ్చి పుష్కర స్నానాలు ఆచరించారు. పవిత్రమైన త్రివేణి సంగమంలో భక్తులు సైకత లింగాలను తయారు చేసి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. పుష్కర ఘాట్ల వద్ద ఆధ్యాత్మిక వాతావరణం నెలకొని భక్తుల సందడితో కళకళలాడింది. శుక్రవారం రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా దంపతులు శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామికి దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. త్రివేణి సంగమంలో గురువారం పుష్కర స్నానాన్ని రాష్ట్ర గవర్నర్ దంపతులు రాత్రి సరస్వతి నవరత్న మాలా హారతి, సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షించారు. ముక్తీశ్వర స్వామి ఆలయ ప్రాంగణానికి చేరుకున్న గవర్నర్ దంపతులకు దేవాదాయ శాఖ కమీషనర్ హనుమంతరావు, ఆలయ పూజారులు పరివట్టం, పూర్ణ కుంభం, మంగళ వాయిద్యాలతో స్వాగతం తెలిపారు. గవర్నర్ దంపతులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పూజారులు గవర్నర్ దంపతులకు ఆశీర్వచనం అందించి, శ్వేత వస్త్రాలు, లడ్డు ప్రసాదం, చక్కెర పొంగలి, అమ్మవారి జ్ఞాపికను బహుకరించారు. అనంతరం స్టాళ్లలో ఏర్పాటు చేసిన దసలి పట్టు వస్త్రాల స్టాలు సందర్శించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర ఐటి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు టస్సార్ పట్టు వస్త్రాలు తయారీ విధానం గవర్నర్ కు వివరించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా మాట్లాడుతూ సరస్వతి అంత్య పుష్కరాలు వైభవంగా జరుగుతున్నాయని, సరస్వతి ఘాట్ వద్ద జరుగుతున్న కాశీ పండితుల నవరత్న మాలా హారతి, సాంస్కృతిక కార్యక్రమాలు అత్యాధునికు అద్దం పడుతున్నా యని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని ఏర్పాట్లు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

## 'నవరత్న మాల హారతి' ప్రత్యక్ష ప్రసారం

కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతి అంత్య పుష్కరాల్లో భాగంగా ప్రతి రోజు కాశి పండితులచే నిర్వహిస్తున్న సరస్వతి నవరత్న మాలా హారతి ప్రతి రోజు రాత్రి 7.30 గంటల నుండి దేశ, విదేశాల్లో నివసిస్తున్న భక్తులు వీక్షించడానికి వీలుగా సమాచార



పౌర సంబంధాల శాఖ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సరస్వతి నవరత్న మాలా హారతి కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నట్లు తెలిపారు. ప్రతీ రోజు రాత్రి 7.30 గంటల నుండి నిర్వహించే సరస్వతి నవరత్న మాలా హారతి కాశీలో అత్యంత ప్రజాదరణ పొందిన గంగా హారతి నిచ్చే పండితుల ద్వారా ఇచ్చేలా ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దాదాపు 45 నిమిషాల పాటు సాగే సరస్వతి నవరత్నమాల హారతిలో తొమ్మిది ప్రత్యేక హారతులను కాశీ పండితులు ఇస్తున్నారు.

## వారాంతపు రద్దీ..

సరస్వతి అంత్య పుష్కరాలు సందర్భంగా శని, ఆది వారాల్లో అధిక సంఖ్యలో భక్తులు పుష్కర స్నానాలు చేసేందుకు వచ్చే అవకాశం ఉన్నందున జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. పుష్కర ఘాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, ఆరోగ్య సేవలు, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర అంశాలపై కలెక్టర్ మాట్లాడుతూ అవసరమైన చోట అదనపు సిబ్బందిని నియమించాలని ఆదేశించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు. భక్తుల రద్దీ పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో వాహనాలు రద్దీ, ట్రాఫిక్ సమస్యను దృష్టిలో పెట్టుకుని ఎలాంటి సమస్య రాకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. వాహనాలు క్రమబద్ధీకరణ, రద్దీ నియంత్రణకు పోలీసు, రవాణా, దేవాలయంలో భక్తులు క్యూ పాటించుట, వైద్య ఆరోగ్య శాఖ, పంచాయతి రాజ్, మిషన్ భగీరథ తదితర శాఖల అధికారులు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఎండ దృష్ట్యా భక్తులు తెల్లవారుజాము నుండే వచ్చే అవకాశం ఉందని అన్ని శాఖల అధికారులు వారికి కేటాయించిన విధుల్లో అందుబాటులో ఉండాలని ఆయన స్పష్టం చేశారు.

## సాంస్కృతిక కార్యక్రమాలు

సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా కాళేశ్వరంలో ఆధ్యాత్మిక ఉత్సాహం, సాంస్కృతిక వైభవం నిండుగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతి సారథి కళాకారులు నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. పుష్కర ఘాట్‌ల వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికలపై సాంస్కృతి సారథి కళాకారులు ఆలపించిన భక్తి గీతాలు, జానపద గీతాలు, ఆధ్యాత్మికానందాన్ని అందించాయి. ముఖ్యంగా సరస్వతి అమ్మవారి మహిమను, నదీ సంస్కృతిని ప్రతిబింబించే పాటలు విశేషంగా ఆకట్టుకున్నాయి.





